'పది'లో ప్రభుత్వ బడుల హవా

మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వెంపటి విగ్నేష్ 565 మార్కులు సాధించాడని హెచ్ఎం జి.సైదులు బుధవారం తెలిపారు. పర్వతగిరి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని బి.సంధ్య 564 మార్కులు, వీఎస్.లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి బి.ఈశ్వర్ 541 మార్కులు, మాధవాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి నూకల విష్ణువర్ధన్ 540 మార్కులు, ముడుపుగల్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి బొమ్మకంటి రాజేష్ 527 మార్కులు సాధించారని ఆయా పాఠశాలల హెచ్ఎంలు తెలిపారు.

కురవి: కురవి, సీరోలు మండలాల్లోని 12 ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓలు బాలాజీ, లచ్చిరాంనాయక్ బుధవారం తెలిపారు. సీరోలు మండలం కాంపల్లి హైస్కూల్‌లో స్పందనకు 565 మార్కులు సాధించి ఉమ్మడి కురవి మండలంలో టాప్‌గా నిలిచింది. గుండ్రాతిమడుగు(విలేజ్) హైస్కూల్‌లో రాజేష్ 564 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాడు. నేరడలోని మోడల్ స్కూల్ విద్యార్థి తేజా కుమార్‌కు 563 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు.

డోర్నకల్: మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన 48 మంది బాలికలు ఉత్తీర్ణులై వంద శాతం ఉత్తీర్ణత సాధించగా పాఠశాలకు చెందిన సింధూజ 568, కొండ స్ఫూర్తి 565 మార్కులు సాధించారు. మోడల్ స్కూల్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. వేముల చరణ్‌తేజ్ 564, రెడ్డెబోయిన శణ్ముకప్రియ 552 మార్కులు సాధించారు. ప్రభుత్వ గిరిజన హాస్టల్‌కు చెందిన 28మంది ఉత్తీర్ణులై వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బా పాఠశాల బాలికలు 42మంది ఉత్తీర్ణులై వందశాతం ఉత్తీర్ణత సాధించగా పాఠశాలకు చెందిన సైదాబాయి 523 మార్కులు సాధించింది.

పెద్దవంగర: మండలంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటు మహాత్మ జ్యోతిబాపూలే, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల్లో 99.63 శాతంతో ఉత్తీర్ణులైయ్యారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో, అవుతాపురం జెడ్పీ పాఠశాలలో, బొమ్మకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో, చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో, కేజీబీవీల వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. పెద్దవంగర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కె.మేఘన 577, చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఆర్.లూకేష్ 577, ఎంజేపీ విద్యార్థి జీ.జశ్వంత్ 576 మార్కులు సాధించినట్లు ఎంఈఓ బుదారపు శ్రీనివాస్ తెలిపారు.

నెల్లికుదురు: మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని నందిని 573, స్ఫూర్తి 565, బొల్లం శ్రీవిద్య 562 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. మండలంలోని వివిధ గ్రామాలల్లో 9 ప్రభుత్వ పాఠశాలకు 4 పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయని ఎంఈఓ రాందాస్ తెలిపారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన డి.వర్షిత 579 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. జోత్స్న 576 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు.

బయ్యారం: మండల కేంద్రంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్.దివ్య 565 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవగా, జీకేపేట పాఠశాల విద్యార్థిని వై.ప్రసన్నభార్గవి 558, బాలికోన్నత పాఠశాల విద్యార్థిని అక్షిత 550 మార్కులు సాధించారు.

గూడూరు: మండలంలోని తీగలవేణి జెడ్పీ ఎస్ఎస్‌కు చెందిన బి.పరమేశ్వరి 579 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. పొనుగోడు జెడ్పీ ఎస్ఎస్‌కు చెందిన ఎస్.శివాణి 572, పావని 567, దివ్య 567 మార్కులు సాధించినట్లు ఎంఈఓ తెలిపారు.



భాగ్యశ్రీ(579) యుగేష్(578) మేఘన(577) నందిని(573) వరుణ్(571) సింధూజ(568)



దివ్య(565) స్పందన(565) విగ్నేష్ (565) రాజేష్(564) సంధ్య(564) అక్షిత(563)



స్పందన(556) రుద్రమ్మ(552)

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 97.71 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సంక్షేమ బాలికల గురుకులం విద్యార్థిని ఎం.భాగ్యశ్రీ 579 మార్కులు, సీహెచ్ తేజశ్రీ 575, మైనార్టీ గురుకులం విద్యార్థిని ఆర్.మేఘన 574, కంఠాయపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి జి.సుప్రియ 568, గుర్తూరు మోడల్ స్కూల్ జాహ్నవి శ్రీ జ్యోతి 565 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. తొర్రూరు ఉన్నత పాఠశాల విద్యార్థి హర్షిత్ 562, కస్తూర్బా పాఠశాల విద్యార్థిని అనూష 561 మార్కులు సాధించారు. మండలంలోని ఏడు పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత నమోదైంది.

కేసముద్రం: మండలంలోని కల్వల మోడల్ స్కూల్ విద్యార్థిని మనస్వినికి 581, యుగేష్ 578 మార్కులు సాధించారు. కల్వల జెడ్పీ హైస్కూల్‌కి చెందిన తేజస్విని 576 మార్కులు, కేసముద్రంస్టేషన్ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన బి.మనీషా 575 మార్కులు, కేసముద్రంవిలేజ్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన జి.యశ్వంత్ 569 మార్కులు, ఇనుగుర్తి మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాలకు చెందిన శృతి 568 మార్కులు, కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన సంతుకు 564 మార్కులు సాధించినట్లు ఎంఈఓ యాదగిరి తెలిపారు.



చిన్నగూడూరు: దేవిప్రియను అభినందిస్తున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

గార్ల: గార్ల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని బండి స్పందన 556, కస్తూర్బాగాంధీ పాఠశాలకు చెందిన బానోత్ అంజలి 554 మార్కులు సాధించారు. మండలంలోని 9జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఆశ్రమ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించగా, కస్తూర్బా గాంధీ పాఠశాలలో 28మందికి గాను 27మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ వీరభద్రం తెలిపారు.

మరిపెడ: మండలంలో మొత్తం 840మంది విద్యార్థులకు గాను 837మంది విద్యార్థులు ఉత్తీర్ణులలయ్యారని ఎంఈఓ అనితదేవి తెలిపారు. జ్యోతిరావు పూలే పాఠశాలలో 568మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. జెడ్పీహెచ్ఎస్ ఎల్లంపేట 564మార్కులతో రెండోస్థానంలో నిలిచింది.

కొత్తగూడ: గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థి 552 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

చిన్నగూడూరు: మండల వ్యాప్తంగా 121మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 121 మంది పాసయ్యారని, వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రవికుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన వి.దేవీప్రియ 567 మార్కులు సాధించి జిల్లా వ్యాప్తంగా కేజీబీవీ పాఠశాలలో టాపర్‌గా నిలిచింది. డీఈఓ రవీందర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. చిన్నగూడూరు, జయ్యారం ప్రభుత్వ పాఠశాలలో 84మంది, కస్తూర్బాలో 37మంది పరీక్షలు రాసి వందకు వందశాతం ఉత్తీర్ణులయ్యారు.

క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా రాజేశ్వర్



మహబూబాబాద్: మానుకోట మున్సిపల్ కమిషనర్‌గా టి.రాజేశ్వర్ బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. మానుకోట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన నోముల రవీందర్ గత నెల 30న ఉద్యోగ విరమణ పొందారు. వరంగల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న టి.రాజేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు.

మహేందర్ బాబుకు డాక్టరేట్



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని గుమ్ముడూరుకు చెందిన సూర్నపు ముత్తయ్య, సుగుణ దంపతుల ఏకైక కుమారుడు సూర్ణపు మహేందర్ బాబు డాక్టరేట్ అందుకున్నారు. మహేందర్ బాబు 16 సంవత్సరాలుగా భారతీయ వాయుసేవలో దేశానికి చేస్తున్న సేవలను గుర్తించి పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ విద్యాపీఠం నిర్వాహకులు డాక్టరేట్ అందజేసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా మహేందర్ బాబు మాట్లాడుతూ.. శ్రీరామచంద్ర మహాప్రభు జన్మస్థలమైన అయోధ్యలో డాక్టరేట్ అందుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

మెమోరియల్ అవార్డు ప్రదానం



నెహ్రూసెంటర్: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, నింగినేల మేముసైతం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి మెమోరియల్ అవార్డును హైదరాబాద్‌లో శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ చేతుల మీదుగా బుధవారం జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అందుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక భూమిక పోషించినందుకు అందజేశారు.

శంకుస్థాపన



బయ్యారం: మండలంలోని కొత్తపేట పంచాయతీలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహ నిర్మాణానికి ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశప్రధానిగా ఇందిరాగాంధీ ప్రజలకు చేసిన సేవలు మరువలేనివన్నారు.

మే11 వరకు రైల్వేగేట్ మూసివేత

గార్ల: గార్ల–డోర్నకల్ మధ్యలో గల రైల్వేగేటు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల దృష్ట్యా మే 11వ తేదీ వరకు రైల్వేగేటు మూసి వేస్తున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రహదారి గుండా వెళ్లే వాహనదారులు, ఆర్టీసీ బస్సులు ప్రత్యామ్నాయ రహదారి గుండా ప్రయాణిస్తూ రైల్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు అభినందనలు

మహబూబాబాద్ రూరల్: పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మహబూబాబాద్ జిల్లా మొదటి స్థానం సాధించిన సందర్భంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి బుధవారం అభినందనలు తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారం గ్రామంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రగతి సేవాసమితి వ్యవస్థాపకుడు గద్దల జాను అన్నారు. ఈసందర్భంగా బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీరామగిరి సొసైటీ చైర్మన్ గుండ వెంకన్న, మాజీ సర్పంచ్ దర్శనం భిక్షపతి, ప్రగతి సేవాసమితి బాధ్యులు చెడుపాక వెంకన్న, సుహాసిని, కదిర జగన్, మహేష్ పాల్గొన్నారు.

పోరాట ఫలితమే సెలవులు

మహబూబాబాద్: సీఐటీయూ పోరాట ఫలితంగానే అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెలంతా ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సంపూర్ణ, స్నేహ బిందు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి యువకుడి మృతి

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయం వద్ద మంగళవారం అర్ధరాత్రి దారావత్ వీరన్న(35) మూత్రవిసర్జన కోసం వచ్చి ప్రమాదవశాత్తు సైడ్ డ్రెయినేజీలో పడి మృతి చెందినట్లు ఎస్సై వెంకన్న బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా దేవులతండా చేవెళ్ల గ్రామానికి చెందిన దారావత్ వీరన్న గత కొన్ని సంవత్సరాలుగా కురవికి వచ్చి కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి గుడి సమీపంలో సైడ్ డ్రెయినేజీలో మూత్రవిసర్జన చేస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి మృతి చెందాడు. విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని బయటకు తీసి మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రిలోని మార్చూరిలో భద్రపరిచినట్లు ఏఎస్సై తెలిపాడు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యం ఇవ్వాలి

నర్సంపేట: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం రమేశ్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకత లోపించిందని చెప్పారు. పేదలను విస్మరించి ఇష్టారీతిన లబ్ధిదారులను ఎంపిక చేశారని తెలిపారు. అర్హులకు మాత్రమే ఇళ్లు అందించాలని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పేదలకు ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. అలాగే పేదలు నివాసిస్తున్న కాలనీల్లో వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, యూపీఎస్ఎం రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, నాయకులు ముప్పారపు రాజేందర్, బైరబోయిన నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌ను అందుబాటులోకి తెస్తాం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: తొర్రూరు పెద్ద చెరువు ప్రాంతంలో మినీ ట్యాంక్‌బండ్‌ను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. రూ.3.50కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో డివిజన్ కేంద్రంలోని పెద్ద చెరువు సమీపంలో చేపట్టనున్న మినీ ట్యాంకుబండ్ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు మినీ ట్యాంకుబండ్‌ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. చెరువు కరకట్టను బలోపేతం చేయడంతోపాటు విద్యుత్ దీపాలు, పచ్చదనం, ఆటస్థలం, బోటింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. తొర్రూరు మున్సిపాలిటీని ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు సోమ రాజశేఖర్, గంజి విజయ్‌పాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, పెదగాని సోమయ్య, దొంగరి శంకర్ పాల్గొన్నారు.



ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

జాబితానుంచి అనర్హులను తొలగించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు

నెల్లికుదురు: ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హుల పేర్లు తొలగించి, అర్హులకు మంజూరు చేసి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని మునిగలవీడు గ్రామ లబ్ధిదారులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం ముందు బుధవారం ధర్నా చేపట్టి ఎంపీడీఓ బాలరాజుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సైదులు మాట్లాడుతూ.. మండలంలోని 31గ్రామాలల్లో సుమారు 700 ఇందిరమ్మ ఇళ్ళు మంజూరి కాగ అందులో సగానికి సగం అనర్హులు ఉన్నారని అన్నారు. అసలైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. లేకుంటే అర్హులైన నిరుపేదలతో రోడ్డుపై ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్లయ్య, ఉపేందర్, నాగరాజు, వెంకటయ్య, వెంకన్న, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్' నిలిపివేయండి

నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోలతో శాంతిచర్చలు జరపాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ బీమానాయక్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరిగి దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర బలగాలను మోహరించి ఆదివాసీ గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, దాడులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భూక్య శ్రీనివాస్, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కర్రె రమేష్, డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సూర్యప్రకాశ్, కేలోత్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

పుట్టెడు దుఃఖం దిగమింగి..

- టెన్త్‌లో 476 మార్కులు సాధించిన ఉదయ్‌కుమార్

మహబూబాబాద్ రూరల్ : తండ్రి మరణించగా పుట్టెడు దుఃఖంతో పదో తరగతి పరీక్షలకు హాజరై 476 మార్కులు సాధించాడు మహబూబాబాద్ మండలం సీత్లాతండా జీపీ పరిధి ఈరియాతండాకు చెందిన బానోత్ ఉదయ్‌కుమార్. బానోతు రవి, అరుణ దంపతుల కుమారుడు ఉదయ్‌కుమార్ జిల్లా కేంద్రంలోని ఏకశిలహోలీ ఏంజిల్స్ హైస్కూల్లో 10వ తరగతి చదివాడు. స్థానిక ఫాతిమా హైస్కూల్ సెంటర్‌లో పరీక్షలు రాస్తున్న సమయంలో తండ్రి రవి అప్పుల బాధతో పురుగుల మందుతాగి మార్చి 27న మృతి చెందాడు. తండ్రి మృతదేహం పోస్టుమార్టం గదిలో ఉండగా ఉదయ్‌కుమార్ రోదిస్తూనే పరీక్ష రాసివచ్చిన అనంతరం దహన సంస్కారాలు పూర్తిచేశాడు. బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో విద్యార్థి బానోత్ ఉదయ్ కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచి 476 మార్కులు సాధించాడు.



బానోత్ ఉదయ్‌కుమార్

రైల్వేబోర్డు మెంబర్‌గా లచ్చిరాంనాయక్



గార్ల: దక్షిణ మధ్య రైల్వేబోర్డు మెంబర్‌గా మండలంలోని తిర్లాపురం గ్రామానికి చెందిన జర్పుల లచ్చిరాంనాయక్‌ను నియమిస్తూ బుధవారం రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ నియామక ఉత్తర్వులు జారీచేశారు. ఈసందర్భంగా తన నియామకానికి కృషిచేసిన మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

మహబూబాబాద్: ప్రతీ ఒక్కరు బాల్య వివాహాలను అరికట్టేందుకు పాటుపడాలని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాల్య వివాహ నిరోధక చట్టంపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నాగవాణి మాట్లాడుతూ.. గిరిజనులలో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతాయన్నారు. బాల్య వివాహాలు చేస్తే సంబంధీకులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు డేవిడ్, అశోక్, బాలల సంరక్షణ అధికారులు నరేష్, వీరన్న పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

నెహ్రూసెంటర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథి రెడ్డి అన్నారు. జిల్లాలో జరిగిన ఆర్టీసీ ఉద్యమ కేసులో భాగంగా నాయకులు బుధవారం కోర్టుకు హాజరయ్యారు. పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మీ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎన్ఎం మృతి

నర్సింహులపేట: సబ్‌సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తూ అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దనాగారం సబ్ సెంటర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దనాగారం సబ్ సెంటర్‌లో సీనియర్ ఏఎన్ఎంగా పని చేస్తున్న ఈవ(60) బుధవారం సబ్‌సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందింది. దంతాలపల్లి ఆరోగ్య కేంద్రంలో గత 20 సంవత్సరాల నుంచి వైద్యశాఖలో పని చేస్తుంది. వైద్యశాఖ అధికారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

శ్రీశ్రీ జయంతి వేడుకలు

దంతాలపల్లి: మండలకేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో బుధవారం జిల్లా అబ్దుల్ కలాం అకాడమీ ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అకాడమీ డైరెక్టర్ చిర్ర సతీష్ శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీశ్రీ తన రచనలతో అప్పటి పాలకుల గుండెల్లో రైలు పరిగెత్తించాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో బాలాజీ, సతీష్, యాకన్న, కృష్ణ, అశోక్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అకాడమీ సభ్యులు

కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలి

చిన్నగూడూరు: జీవితం ఉన్నది జీవించడానికే, ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో త్వరలో పోలీస్ వారికి చేపట్టే ఆత్మహత్యలు నివారణ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను బ్రోచర్లను పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై ప్రవీణ్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మహత్యా ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల, సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత 20 సంవత్సరాలుగా ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తూ ఇప్పటి వరకు 28 మంది జీవితాలను కాపాడటం అభినందనీయమన్నారు. ఇటీవల పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఆత్మహత్యలు ఎక్కువగా అవుతున్న సందర్భంగా త్వరలో పోలీస్ వారికి రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్, చైర్మన్ అశోక్

డిగ్రీ కళాశాలలో నూతన గ్రూపులు

గార్ల: గార్లలోని డిగ్రీ కళాశాలలో 2025–2026 విద్యా సంవత్సరం నుంచి బీఎస్సీ బీజెడ్సీ, బీఎస్సీ ఎంపీసీ గ్రూపులు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజు వెల్లడించారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో కొత్తగా సైన్స్, మ్యాథ్స్ గ్రూపులు మంజూరైనందున, ఇటీవల గార్లలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పాసైన విద్యార్థులు దోస్త్ ద్వారా డిగ్రీ అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఉచితంగా విద్యార్థులు ఆన్‌లైన్ చేసుకునే అవకాశం కల్పించామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజు

కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో బుధవారం కురిసిన తేలికపాటి వర్షానికి ధాన్యం తడిసిందని, నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు చేయలేదని రైతులు తెలిపారు. ఆరబోసిన ధాన్యానికి సరిపడా పట్టాలు లేక వర్షంతో తీవ్ర అవస్థలు పడినట్లు వాపోయారు. కొనుగోలు కేంద్రంలో నాణ్యతా ఉన్న ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి, నిల్వలు లేకుండా వెంటనే లారీల్లో తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉంచితే ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో రైతులు వెంకన్న, వీరయ్య, అనిల్, మల్లయ్య, ఐలయ్య తదితరులు ఉన్నారు.